నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | VIKARABAD


శంకర్‌పల్లి మండలం కొత్తపల్లిలోని పల్లె ప్రకృతివనంలో కాలిపోయిన మొక్కలు

# పల్లెప్రగతి అస్తవ్యస్తం

- కేసీఆర్ హయాంలో ప్రతినెలా నిధుల కేటాయింపుతో ప్రగతి పథంలో పల్లెలు
- పంచాయతీలను విస్మరించిన రేవంత్ సర్కార్
- నిలిచిన నిధుల కేటాయింపు..
- రంగారెడ్డిజిల్లాలో ఎండిపోతున్న పల్లెప్రకృతివనాలు
- కిస్తీలు కట్టలేక మూలనపడ్డ జీపీ ట్రాక్టర్లు

**దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని భావించి గత కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల్లో పల్లెప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతినెలా కేటాయించిన ప్రత్యేక నిధులతో గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టారు. దీంతో రాష్ట్రంలోని ఏ గ్రామానికెళ్లినా పచ్చని పల్లె ప్రకృతివనాలు, ఊరికో ట్రాక్టర్, రోడ్లు అద్దంలా మెరిశాయి. అయితే, 14 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గ్రామ పంచాయతీలపై దృష్టి సారించడంలేదు. వాటికి నిధులను నిలిపేసింది. దీంతో నిధుల్లేక, నిర్వహణ పట్టించుకునే నాథుడు లేక పల్లెప్రగతి కార్యక్రమం నీరుగారిపోతున్నది. గతంలో పచ్చదనంతో కళకళ లాడిన పల్లెప్రకృతివనాలు నేడు నీళ్లు లేక ఎండిపోతున్నాయి.**

షాబాద్, ఫిబ్రవరి 23 : గత కేసీఆర్ ప్రభుత్వం పల్లెల అభ్యున్నతికి ఎంతో కృషి చేసింది. గ్రామాల ప్రగతి కోసం ప్రతినెలా నిధులను కేటాయించింది.

వాటితో హరితహారం నర్సరీలు, పల్లెప్రకృతివనాలు, డంపింగ్‌యార్డులు, తెలంగాణ క్రీడాప్రాంగణాలు, రైతువేదికలు, చెత్త సేకరణకు ట్రాక్టర్లు, వాటర్‌ట్యాంకర్లు, వైకుంఠధామాలను అధికారులు ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో రంగారెడ్డి జిల్లాలోని ఏ గ్రామానికెళ్లినా పచ్చని పల్లె ప్రకృతివనాలు, ఊరికో ట్రాక్టర్, చెత్త సెగ్రిగేషన్ షెడ్లు, రోడ్లు అద్దంలా కనిపించాయి. అప్పట్లో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీలను పరిశీలించి అవార్డులను ప్రకటిస్తే.. అందులో అత్యధికంగా తెలంగాణ పల్లెలనే వరించేవి. అందులో అత్యధికంగా మన జిల్లాకే దక్కేవి. గ్రామాలంటే తెలంగాణలో ఉన్నట్లు ఉండాలని.. అద్భుతమైన పల్లె పాలనకు కేసీఆర్ సర్కారు నిదర్శనమటూ యావత్ దేశం కీర్తించింది.

అయితే.. ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గ్రామ పంచాయతీలకు వచ్చే నెలవారీ నిధులూ నిలిచిపోయాయి. దీంతో నిధుల్లేక, నిర్వహణ పట్టించుకునే నాథుడు లేక పల్లెప్రగతి కార్యక్రమం నీరుగారిపోతున్నది. గతంలో పచ్చదనంతో కళకళలాడిన పల్లెప్రకృతివనాలు నేడు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. కిస్తీలు కట్టలేక గ్రామ పంచాయతీల్లోని ట్రాక్టర్లు మూలనపడ్డాయి.


శంకర్‌పల్లి : ఎర్వగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణంలో తుప్పుపడుతున్న పరికరాలు

## పంచాయతీలను పట్టించుకోని ప్రభుత్వం..

పంచాయతీలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోని 21 మండలాల్లో మొత్తం 531 గ్రామ పంచాయతీలున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో 'పల్లెప్రగతి'లో చేపట్టిన పల్లెప్రకృతివనాల్లో నాటిన మొక్కలకు నీరులేక ఎండిపోతున్నాయి. తెలంగాణ క్రీడాప్రాంగణాల నిర్వహణ సరిగా లేకపోవడంతో అందులో అమర్చిన పరికరాలు తుప్పుపట్టి పాడవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో గత ప్రభుత్వం జీపీలకు అందించిన ట్రాక్టర్లకు కిస్తీలు చెల్లించలేక మూలనపడ్డాయి. పారిశుధ్య నిర్వహణలో భాగంగా గతంలో పల్లెల్లో ఇంటింటికీ పంపిణీ చేసిన చెత్త డబ్బాలు పాడైపోగా, కొత్తవి కొనలేని దుస్థితి నెలకొన్నది. తడి, పొడి చెత్తను వేరు చేసే సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ లేకుండా పోయింది. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు నీరులేక ఎండిపోతున్నాయి. పల్లెలన్నీ సమస్యల వలయంలో సతమతమవుతున్నాయి.



షాబాద్ : నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణం


శంకర్‌పల్లి : ఎర్వగూడలో మరమ్మతులకు డబ్బుల్లేకపోవడంతో మూలనపడిన గ్రామపంచాయతీ ట్రాక్టర్

## ఏడాదిగా స్పెషల్ ఆఫీసర్ల పాలన

గ్రామాల్లో గతేడాది నుంచి ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నది. ఒక్కో అధికారికి మూడు నుంచి నాలుగు గ్రామాలను అప్పగించడంతో పని భారం ఎక్కువైంది. మరో వైపు మండల పరిషత్‌లకు జిల్లా అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించడంతో గ్రామ, మండల స్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ట్రాక్టర్లు, ట్యాంకర్ల మెయింటెనెన్స్, తాగునీటి పైపులైన్ లీకేజీలు, వీధి దీపాలకు మరమ్మతులు తదితర పనులకు పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. నిధుల కొరతతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం కష్టంగా మారింది. కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో తాము విధులకు రాలేమని వారు చెబుతుండడంతో ఆయా గ్రామాల్లోని తాజా, మాజీ సర్పంచులు మీకు వేతనాలు చెల్లిస్తామని ఒప్పుకొని వారితో పనులు చేయిస్తున్నారు. ఓ వైపు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడం, మరోవైపు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండడంతో ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీలపై ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



## విరబూసిన మోదుగ పూలు

మండలంలోని అడవులు, పొలాల గట్ల దగ్గర మోదుగ చెట్లు విరబూసి ప్రకృతిని మైమరిపించేలా కనువిందు చేస్తున్నాయి. ఆ దారిలో వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి. మోదుగ పూలు హోలీ పండుగ రాకను తెలియజేస్తాయి. –కులకచర్ల, ఫిబ్రవరి 23


ఆదివారం జనంతో కిటకిటలాడుతున్న ముషీరాబాద్ చేపల మార్కెట్

# రంగారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో లక్షలాదిగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు
# నిరీక్షణకు తెర పడేనా..?

- గతంలో 15 నుంచి 20 శాతం కూడా రెగ్యులరైజేషన్ కాని వైనం
- క్రమబద్ధీకరణ కోసం కొన్నేండ్లుగా ఎదురుచూస్తున్న ప్లాట్ల యజమానులు
- ఈసారైనా త్వరగా పూర్తి అయ్యేనా..?
- శివారు మున్సిపాలిటీల నుంచి భారీగా వచ్చిన దరఖాస్తులు



**జిల్లాలో ఎల్ ఆర్ఎస్ ప్రక్రియ ప్రారంభమైన వెంటనే లేఅవుట్ల లో మిగిలిపోయిన ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం వచ్చిన దరఖాస్తులు 2,38,268 ఉన్నాయి.**

| మున్సిపాలిటీ పేరు | వచ్చిన దరఖాస్తులు |
|---|---|
| ఆదిబట్ల | 17,619 |
| పెద్దఅంబర్‌పేట | 49,260 |
| బండ్లగూడ జాగీర్ | 7,892 |
| శంషాబాద్ | 10,031 |
| ఇబ్రహీంపట్నం | 6,197 |
| కొత్తూరు | 3,596 |
| శంకర్‌పల్లి | 4,780 |
| ఆమనగల్లు | 3,562 |
| బడంగ్‌పేట | 45,582 |
| తుక్కుగూడ | 2,440 |
| జల్‌పల్లి | 10,914 |
| తుర్కయాంజాల్ | 48,806 |
| మణికొండ | 2,591 |
| నార్సింగి | 3,356 |
| మీర్‌పేట | 3,412 |
| షాద్‌నగర్ | 14,996 |

రంగారెడ్డి, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : ఈసారైనా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ సాఫీగా సాగి తమ ప్లాట్లను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని పలువురు ప్లాట్ల యజమానులు కోరుతున్నారు. గతంలో ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం జిల్లాలో పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో 15 నుంచి 20 శాతం కూడా పరిష్కారానికి నోచుకోలేదు. గతంలో ప్రభుత్వం ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం విధించిన షరతుల కారణంగా అది ముందుకు సాగలేదు. చాలీచాలని రెవెన్యూ సిబ్బంది, టీపీవోల కొరత, ఇరిగేషన్‌కు హైడ్రా దెబ్బవంటి ప్రభావంతో ప్లాట్ల క్రమబద్ధీకరణ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఈసారైనా నిబంధనలు సడలించి లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ప్రక్రియను వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలో 13 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లు, 519 గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో 2,38,268 మంది తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోగా.. వాటిలో 50,000 కూడా పూర్తి కాలేదు.

### శివారు మున్సిపాలిటీల నుంచి భారీగా..

జిల్లాలోని శివారు మున్సిపాలిటీల్లోని యజమానులు ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఏండ్లుగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా 13 మున్సిపాలిటీలున్నాయి. ఇవి అన్ని హైదరాబాద్ నగరం చుట్టే విస్తరించి ఉన్నాయి. దీంతో ఈ మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున లేఅవుట్లు చేశారు. ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎల్ఆర్ఎస్ లేకపోవడంతో బ్యాంకు రుణాలు రాక.. ఇండ్ల నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు పెద్ద ఎత్తున క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. అప్లికేషన్ల పరిశీలనకు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలో సిబ్బంది కొరతతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ నుంచి 49,260 దరఖాస్తులు, తుర్కయాంజాల్ నుంచి 48,806, బడంగ్‌పేట నుంచి 45,582 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఇప్పటివరకు 15 నుంచి 20 శాతం కూడా రెగ్యులరైజ్ కాలేదు. ఈసారైనా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ సాఫీగా సాగి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించాలని పలువురు కోరుతున్నారు.

### ఉచిత హామీని నిలబెట్టుకోవాలి



అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్లాట్లను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని ప్రకటించారు. దాని ప్రకారమే రేవంత్‌రెడ్డి సర్కార్ ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలి. జిల్లాలో అనేక మంది పేదలు అప్పులు చేసి ప్లాట్లను కొనుగోలు చేశారు. క్రమబద్ధీకరణ కోసం డబ్బులు వెచ్చించే స్థితిలో వారు లేరు.

పాతూరి రాజేశ్‌గౌడ్

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో
# కొహెడ పండ్ల మార్కెట్
**రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్ర మోహన్**


పండ్ల మార్కెట్ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 23 : అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కొహెడ పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్ర మోహన్ అన్నారు. ఆదివారం ఆయన గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి పండ్ల మార్కెట్ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పండ్ల మార్కెట్ నిర్మాణానికి సిద్ధమైన డీపీఆర్ తోపాటు లేఅవుట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఇంజినీర్ లక్ష్మణుడు పాల్గొన్నారు.




# బోటింగ్ చేసి.. సరదాగా గడిపి..
**కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి**

మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. యువతీయువకులు ఉదయమే కుటుంబసమేతంగా తరలివచ్చి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. అదేవిధంగా ఆహ్లాదకరమైన ప్రాజెక్టు అందాలను తిలకించి సహపంక్తి భోజనాలు చేశారు. పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే తెలిసేలా ప్రాజెక్టు పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. - ధారూరు, ఫిబ్రవరి 23

# ఫ్యూచర్‌సిటీకి గ్రీన్ కారిడార్

- శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి రావిర్యాల మీదుగా మెట్రో మార్గం
- ఎయిర్ పోర్ట్ మెట్రో కారిడార్‌లో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పర్యటన



సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : ప్రతిపాదిత ఫ్యూచర్‌సిటీకి గ్రీన్ కారిడార్ మెట్రోను నిర్మించనున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో పరుగులు పెట్టేలా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైలు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీతో కలిసి ఈ ప్రాజెక్టును చేపట్టనుండగా.. ఫ్యూచర్ సిటీకి అనువుగా గ్రీన్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీకి చేరుకునేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో గ్రీన్ కారిడార్‌ను నిర్మిస్తామని హైదరాబాద్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మీర్‌ఖాన్ పేట్‌లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారీకోసం జరుగుతున్న సర్వే పనుల నేపథ్యంలో ... ఆదివారం యన మెట్రో అధికారులతో కలిసి కొంగరకలాన్ దాటి క్షేత్ర స్థాయిలో పర్యటించారు.

### 40 కిలోమీటర్లు ఉండేలా..

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్లు ఉండేలా నిర్మిస్తున్నారు. ఎయిర్ పోర్ట్ టెర్మినల్ నుంచి మొదలై మెట్రో రైల్ డిపో మీదుగా, ఎయిర్‌పోర్ట్ సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా మన్సాన్‌పల్లి రోడ్డు గుండా పెద్ద గొల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్‌కు చేరునున్నది. బహదూర్‌గూడలో ఒక అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండల్లో రెండు మెట్రో స్టేషన్లను అభివృద్ధి చేస్తామని ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల్ ఎగ్జిట్ వరకు దాదాపు 14 కిలోమీటర్ల పొడవునా.. ఈ మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్ మెట్రో మార్గంగా ఓఆర్ఆర్‌లో మెట్రో రైలుకు కేటాయించిన ప్రాంతంలో తక్కువ ఎత్తులో నిర్మిస్తామన్నారు. అక్కడి నుంచి సిల్క్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగూడ, మీర్‌ఖాన్‌పేట్ వరకు 328 అడుగుల వెడల్పుతో నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 72 అడుగుల వెడల్పుతో ఉండే ప్రాంతంలో భూ ఉపరితల మెట్రో రైలును అభివృద్ధి చేయనున్నారు. విశాలమైన రోడ్డు మధ్యలో రోడ్డుకు సమానంగా మెట్రోకు ఇరువైపులా మూడు లైన్ల విశాలమైన రోడ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. రూ. 22 వేల కోట్లతో మెట్రో మొదటి దశను 69 కిలోమీటర్ల మేర నిర్మించినట్లుగానే, హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ, మెట్రో రైల్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లుగా తెలిపారు.

### గంటకు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ..

36.8 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గంలో మొత్తం 24 స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ప్రతిపాదిత మెట్రోస్టేషన్ల నిర్మాణంలో కొన్ని మార్పులకు అవకాశం ఉందని సమాచారం. ఇందులో నాగోల్, నాగోల్‌చౌరస్తా, అల్కాపురి, కామినేని హాస్పిటల్, ఎల్బీనగర్, బైరామల్‌గూడ, మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట, ఒవైసీ హాస్పిటల్, డీఆర్డీవో, బాలాపూర్ రోడ్డు, చాంద్రాయణగుట్ట, బండ్లగూడ రోడ్, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, ఆరాంఘర్, న్యూహైకోర్టు, గగన్‌పహాడ్, శాతంరాయి, సిద్ధాంతి, శంషాబాద్, ఎయిర్‌పోర్టు కార్గో, ఎయిర్‌పోర్టు ప్రాంగణం వరకు ఈ మార్గాన్ని నిర్మించనున్నారు. ప్రాథమిక దశలో గంటకు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా నిర్మిస్తుండగా... భవిష్యత్‌లో మెట్రో వేగం పెరిగే అవకాశం ఉందనీ మెట్రో వర్గాలు పేర్కొన్నా యి. ప్రస్తుతం ఈ మార్గానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం డీపీఆర్ పంపించిన విషయం తెలిసిందే.

### 24 స్టేషన్లు..36.8 కి.మీలు
### నాగోల్ టూ ఎయిర్‌పోర్టు... లైన్ క్లియర్

హైదరాబాద్ మెట్రో విస్తరణ లో ఫేస్-2లో అత్యంత రద్దీ కలిగిన మార్గంగా నాగోల్ శంషాబాద్ లైన్ క్లియరైంది. నాగోల్ నుంచి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టును అనుసంధానం చేసే ఈ మార్గం పొడవు మొత్తం 36.8 కిలోమీటర్లు కాగా.. దీని ద్వారా నిత్యం 3.70 లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉం దని హెచ్ఏఎంఎల్ అంచనా వేస్తున్నది. ఫేస్-2లో కారిడార్-4ను దాదాపు రూ. 11,226 అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే నగరం నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెరుగైన రవాణా సదుపాయం అందుబాటులోకి రానున్నది. కాగా, కొత్తగా వచ్చే స్టేషన్ల వివరాలను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ వెల్లడించింది. శంషాబాద్‌లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు మెరుగైన రవా ణా కల్పనలో భాగంగా మెట్రో ప్రతిపాదించిన మార్గం భవిష్యత్తులో అత్యంత రద్దీ కలిగిన మార్గం కానున్నది. తొలి దశ మెట్రో నిర్మాణంలో నాగోల్-రాయదుర్గం మార్గాన్ని అత్యధికంగా ప్రయాణికులు వినియోగిస్తున్నారు. ఇదే తరహాలో ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్ బిజీగా మారనున్నదని మెట్రో వర్గాలు భావిస్తున్నారు.